## కెసిఆర్ ఫాంహౌజ్‌లో పార్లమెంటరీ పార్టీ సమావేశం



సమావేశంలో మాజీ సిఎం కెసిఆర్, కెకె

**మర్కుక్, జనవరి 26 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో గల మాజీ సిఎం కెసిఆర్ వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నియోజకవర్గాల ఎంపీలు, పార్ల మెంట్ ఇన్‌ఛార్జిలు పలువురు హాజరయ్యారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపిలకు దిశానిర్దేశంచేశారు. రాజ్యసభ, లోక్‌సభల్లో పార్లమెంటరీ పార్టీ నేతలు కేశవరావు, నామా నాగేశ్వర్‌రావు, మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్‌రావు, పలువురు ఎంపీలు హాజరై రాబోయే పార్లమెంట్ ఎన్నికల విషయమై చర్చించారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


## దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు అరుదైన ఆపరేషన్లు

**దుబ్బాక, జనవరి 26, ప్రభాతవార్త :**

దుబ్బాక ప్రభుత్వ అసుపత్రిలో శుక్రవారం రాజీవ్ అరోగ్య శ్రీ కింద రెండు అరుదైన ఆపరేషన్లు చేశారు. లార్జ ఫైబ్రాయిడ్ గడ్డతో పాటు గర్భసంచి తొలిగించారు. మరో ఆపరేషన్ పీత్తాషయం నుంచి గాల్బ్లాడర్‌తో పాటు 30 రాళ్లను తొలిగించారు. కామారెడ్డి జిల్లా బీబీపేటకు గ్రామానికి చెందిన మ్యాదరి లక్ష్మి రెండు యేండ్ల నుంచి కడుపునొప్పితో బాధపడుతూ అనేక ఆసుపత్రులు తిరిగి కిమ్స్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి రెండు లక్షల ఖర్చు అవుతుందని చెప్పగా వారు దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ హేమ్‌రాజ్‌సింగ్‌ను కలిశారు. లక్ష్మీకి రెండు యూనిట్ల రక్తం ఎక్కించి 5 కిలలో ఫైబ్రాయిడ్ గడ్డతో పాటు గర్భసంచిని తొలిగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారు. దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పోసన్నగారి రుక్మిణి మూడు యేండ్లుగా కడుపునొప్పితో బాధపడుతూ వారం రోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదిస్తే ఆమెకు ఆపరేషన్ చేసి గాల్బ్లాడర్ నుంచి 30 రాళ్లను(250 గ్రాములు) తొలిగించి పిత్తాశయంను తొలిగించారు. ప్రస్తుతం రోగి క్షేమంగా ఉన్నారు. ఆపరేషన్‌లో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ నుంచి ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఎంపిడిఓ వెంకట్‌రెడ్డి

### ఉత్తమ అవార్డు అందుకున్న ఎంపిడిఓ

**న్యాల్‌కల్, జనవరి 26, ప్రభాతవార్త:** మండల అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహిస్తున్న వెంకట్‌రెడ్డి ఉత్తమ ఎంపిడివో అవార్డును అందుకున్నారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఎంపిడిఓ వెంకట్‌రెడ్డికి ఉత్తమ అవార్డును అందించారు. కలెక్టర్ వల్లూరి క్రాంతితో ప్రశంసా పత్రం అందుకున్న ఎంపిడిఓ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సహకారంతో మండలాభివృద్ధికి కృషిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సమన్వయంతో పనులు చేస్తే అభివృద్ధి తథ్యమని వెంకట్‌రెడ్డి గుర్తు చేశారు.

### పోలీసు సేవా పతకం అందుకున్న ఎఎస్ఐ



పోలీసు సేవాపతకం అందుకుంటున్న షోయబ్‌ఉర్ రెహమాన్

**జహీరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** పట్టణంలోని పోలీసు ఠాణాలో ఎఎస్ఐగా సేవలు అందిస్తున్న మహ్మద్ షోయబ్ ఉర్ రెహమాన్ పోలీస్ సేవా పతకాన్నిను అందుకున్నారు. సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్‌పి సిహెచ్ రూపేష్ చెన్నూరిల చేతుల మీదుగా షోయబ్ ఉర్ రెహమాన్ అవార్డును అందుకుని ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు. పోలీస్ సేవా పథకం అందుకోవడం ఆనందంగా ఉందని, పథకంతో తనపై బాధ్యతలు మరింతగాపెరిగాయని షోయబ్ ఉర్‌రెహమాన్ పేర్కొన్నారు.

### ఉత్తమ ఎంఈఓ అవార్డు అందుకున్న అంజయ్య

**సదాశివపేట/పుల్కల్, జనవరి 26, ప్రభాతవార్త:** విద్యా ప్రమాణాల



కలెక్టర్‌చే ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఎంఈఓ అంజయ్య

మెరుగుకు కృషి చేస్తున్న ఎంఈఓ (సదాశివపేట, పుల్కల్, చౌటకూరు మండలాలు) డి అంజయ్య ఉత్తమ ఎంఈఓ అవార్డును అందుకున్నారు. విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు (44 మార్లు రక్తదానం, 2009 నుంచి 2024 వరకు 5 మండలాల్లో 8వందల మంది బాలకార్మికులను బడిలో చేర్పించడం)లకు గుర్తింపుగా అంజయ్యను ఉత్తమ ఎంఈఓగా ఎంపిక చేసి జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ వల్లూరి క్రాంతి, డిఈఓ వెంకటేశ్వరులు అంజయ్యకు ఉత్తమ అవార్డును అందించారు. ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి,ఉత్తమ పాఠశాలల పర్యవేక్షణకు ఉత్తమ అవార్డు అందించినట్లు డి అంజయ్య పేర్కొన్నారు.

### ఉత్తమ అవార్డు అందుకున్న ఎస్ఐ సుభాష్



కలెక్టర్‌చే ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఎస్ఐ సుభాష్

**అత్నూర, జనవరి 26, ప్రభాతవార్త:** హత్నూర ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సుభాష్ ఉత్తమ ఆవార్డును అందుకున్నారు. సంగారెడ్డి పట్టణంలోని పోలిస్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఎస్ఐ సుభాష్‌కు ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసి జిల్లా ఎస్‌పి సిహెచ్ రూపేష్ చెన్నూరితో కలిసి కలెక్టర్ ప్రశంసా పత్రాన్ని అందచేశారు. త్తమ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని ఎస్ఐ సుభాష్ ఆనందం వ్యక్తం చేశారు. ఉత్తమ అవార్డు అందుకోవడంతో తనపై మరింత భారం పెరిగిందన్నారు.

### ఉత్తమ సేవలకు పురస్కారాలు

**పెద్దశంకరంపేట, జనవరి26 ప్రభాతవార్త:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలోనే ఉత్తమ సేవలు అందించిన మండలానికి చెందిన ముగ్గురు అధికారులకు శుక్రవారం మెదక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. జిల్లాలోనే ఉత్తమ ఎంపీడీవోగా పెద్దశంకరంపేట ఎంపీడీవో రఫీక్ ఉన్నీసాకు, విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు గాను పెద్దశంకరంపేట ఎస్ఐ బాలరాజుకు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రాథమిక సహకార పరపతిసంఘం సీఈవో రవి జిల్లా కలెక్టర్ రాజర్షిషా చేతుల మీదుగా ప్రశంసాపత్రాలతోపాటు అవార్డులను అందుకున్నారు.



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎంపీడీవో రఫీక్‌ఉన్నీసా

## జోగిపేట మినీస్టేడియంను మున్సిపాలిటీకి అప్పగించండి

### ఆర్డీవో పాండును ఆదేశించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా

**జోగిపేట, జనవరి 26, ప్రభాతవార్త:** జోగిపేట బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్మించిన ఎన్టీఆర్ మినీ స్టేడియం వృధాగా ఉండటంతోపాటు పూర్తిగా చెడిపోతున్న సందర్భంగా రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జోగిపేట మున్సిపాలిటీకి అప్పగించాలని అందోలు ఆర్డీవో పాండును ఆదేశించారు. శుక్రవారం మంత్రి దామోదర్ రాజనర్సింహ జోగిపేటలో పర్యటించి నూతనంగా నిర్మించిన రైతుబజార్, క్రీడా మైదానాలను పరిశీలించారు. నూతనంగా నిర్మాణం చేసిన రైతుబజార్లోకి కూరగాయల వ్యాపారస్తులు రావడానికి నిరాకరించటంతో అది వృధాగా ఉంది. దీంతో దానిని దేనికి కేటాయిస్తే బాగుంటుందనే ఆలోచనతో రైతుబజార్‌ను మంత్రి పరిశీలించారు. అలాగే పక్కనే ఉన్న క్రీడామైదనంలో పర్యటించి మినిస్టేడియంతో పాటు క్రీడాకారులకోసం నిర్మాణం చేసిన భవనాన్ని పరిశీలించారు. అవి వినియోగంలో లేకపోవటంతో మద్యం ప్రియులకు అడ్డాగా మారాయని పలువురు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కాగా నూతనంగా నిర్మాణం చేసిన మినీస్టేడియం భవనాలను స్పోర్ట్స్ అథారిటీ అనుమతి తీసుకుని జోగిపేట మున్సిపాలిటీకి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆర్డీవో పాండును ఆదేశించారు. క్రీడామైదానంలో క్రీడలు తప్ప



జోగిపేట క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

మిగతా ఎలాంటి కార్యక్రమాలకు అవకాశంలేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు.

**జోగిపేట నుంచి అజ్జమర్రికి రోడ్డు నిర్మాణానికి పరిశీలన**

జోగిపేట నుంచి నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన అజ్జమర్రికి రోడ్డును నిర్మాణం చేస్తే అక్కడి వారు జోగిపేటకు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో ఆరోడ్డు నిర్మాణంచేయాలనే ఉద్దేశంతో దానిని పరిశీలించారు. జోగిపేటలోని పంచముఖి హనుమాన్ మందిరం నుంచి మల్లన్నగండి వెంట అజ్జమర్రికి వెళ్లేందుకు ఉన్న ఫార్మేషన్ రోడ్డును మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. మధ్య ఏరు ఉండటంతో అక్కడ వంతెన నిర్మాణం చేయాల్సి ఉంటుందని, దీని నిర్మాణం వల్ల ఏటి అవతలి గ్రామాలకు జోగిపేట చాలా దగ్గరవుతుందని గమనించారు. ఈ సందర్భంగా ఆయనవెంబడి కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, రంగ సురేష్, కోరబోయిన నాని, కాంగ్రెస్ నాయకులు పట్లోల్ల ప్రవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.



గౌరవ వందనం చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

## ప్రజా సంక్షేమానికి సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన కొనసాగుతుంది : జిల్లా కలెక్టర్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్వర్యంలో ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి ప్రజాపాలన కార్యక్రమం చేపట్టిందని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన 75వ గణతంత్ర వేడుకల్లో అయన జాతీయ జెండాను అవిష్కరించారు. అనంతరం సీపీ అనురాధతో కలిసి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే అర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 33 లక్షల మంది మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. రాజీవ్ అరోగ్యశ్రీ పథకం పేదలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమహే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. త్వరలో పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందబోతున్నాయన్నారు. జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, కొండా సురేఖ, దామోదర రాజనర్సింహాలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్వాతంత్ర సమరయోధులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గేయాలు ప్రతి ఒక్కరిని అలంరించాయి. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మ, సీపీ డా॥అనురాధ, జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుల ఆశయ సాధనకు కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**మెదక్ అర్బన్, జనవరి 26 ప్రభాతవార్త:**

75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెదక్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పర్యావరణానికి ప్రాధాన్యం ఇస్తూ ప్లాస్టిక్ రహిత రిపబ్లిక్ డేను ఏర్పాటు చేసిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా మువ్వన్నెల జాతీయపతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత భారత దేశ పౌరులందరికీ ప్రజాస్వామ్య వ్యవస్థలో నడిపించడానికి, స్వాతంత్ర్య పోరాట ఆశయాలను నెరవేర్చడానికి భారత ప్రభుత్వానికి రాజ్యాంగం లేనందున 1935 భారత ప్రభుత్వ చట్టం ఆధారంగా పాలన కొనసాగిందన్నారు. కొత్తగా దేశ రాజ్యాంగాన్ని రూపొందించుటకు 1947 ఆగస్టు28న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అధ్యక్షతన రాజ్యాంగ నిర్మాణ కమిటీని ఏర్పాటు చేసి అతిపెద్ద రాజ్యాంగాన్ని లిఖించుకున్నామన్నారు. జనవరి 26, 1950 నుండి నూతన రాజ్యాంగం అమల్లోకి తెచ్చుకున్నామన్నారు. నాటి నుండి భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించిందని, ప్రజలందరూ సంపూర్ణ స్వేచ్ఛను, సమానత్వాన్ని, లౌకితత్వాన్ని, న్యాయాన్ని పూర్తిస్థాయిలో హక్కుగా పొందారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని ప్రస్తావిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలనే తపనతో తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో భాగంగా ఆరు గ్యారెంటీలక అమలుకు హామీ ఇచ్చి, రెండు గ్యారెంటీలను ఇప్పటికే నెరవేర్చిందన్నారు. ప్రజా పాలన కార్యక్రమం ఏర్పాటు చేసి గ్రామ పంచాయితీలు,



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మున్సిపాలిటీల వారీగా గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. మహాలక్ష్మీ పథకం క్రింద జిల్లాలో మెదక్ డిపోరోజుకు 34,010 మంది, నర్సాపూర్ 80,129, దాదాపు జిల్లాలో 62,500 మంది 9 రూట్లలో 103 బస్సుల్లో ప్రయాణ సౌకర్యతో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారన్నారు. మహాలక్ష్మీ ప్రతి నెల ఆర్థిక సహాయం కోసం 1,87,883, వంట గ్యాస్ సబ్సిడీకి 1,95,377 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. రైతు భరోసా పథకం కింద 1,445,777, వ్యవసాయ కూలీ పథకం కింద 6,579 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. ఇందిరమ్మ ఇండ్లకు 1,993,169, తెలంగాణ అమర వీరుల, తెలంగాణ ఉద్యమకారులకు 405 దరఖాస్తులు, గృహజ్యోతికు 1,74,016, చేయూతలో దివ్యాంగుల పెన్షన్‌కు 4,685, ఇతర పెన్షన్ల కొరకు 46,960 దరఖాస్తులు ప్రజా పాలన కార్యక్రమలో 2,25,860 కంప్యూటరీకరణ చేయడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు మద్దతు ధర ఈ వానా కాలం 2023-24లో 410 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, 3,228,718 మెట్రిక్ టన్నుల వరి ఇధాన్యం మద్దతు ధరతో 78,552 రైతుల నుంచి కొనుగోలు చేసి 724 కోట్ల 17 లక్షల రూపాయలు చెల్లించడం జరిగింది. వైద్య ఆరోగ్య శాఖ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో రూపాయలు 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ఈ పథకం కింద 126 రకాల వ్యాధులకు జీవితకాలం మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. ప్రజలు కూడా జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. బాలబాలికలు ఏకరూర దుస్తులు ధరించి తమ అభినయంతో అలరింపజేశారు. ప్రజా పాలన, ప్లాస్టిక్ నిర్మూలన, రాజీవ్ ఆరోగ్యశ్రీ, పోచారం అభయారణ్యంలో పక్షిజాతులు, పట్టణ పేదరిక నిర్మూలన, వృత్తి నైపుణ్య శిక్షణ, ఓట్ల చైతన్య రథం వంటి పథకాలకు సంబంధించి శకటాలను ఏర్పాటు చేశారు. అనంతరం శాసనసభ ఎన్నికలు సజావుగా నిర్వహించుటలో చిత్తశుద్ధితో పనిచేసిన అధికారులకు, ఉత్తమ సేవలు అందించిన పలువురు ఉద్యోగులకు కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ బాలస్వామి, శాసన సభ్యులు మైనంపల్లి రోహిత్‌రావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్‌లు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి లక్ష్మీశారద, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పతాకావిష్కరణ గావించారు.

### లైబ్రేరియన్‌కు ప్రశంసా పత్రం



కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న శంకర్

**రామాయంపేట, జనవరి 26, ప్రభాతవార్త :** పట్టణంలోని గ్రంథాలయంలో పనిచేస్తున్న లైబ్రరెరియన్ శంకర్‌కు ప్రశంసాపత్రం లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మెదక్‌లో జరిగిన కార్యక్రమంలో శంకర్‌కు జిల్లాకలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. శంకర్‌కు ప్రశంసాపత్రం రావడం పట్ల పలువురు పాఠకులు హర్షం వ్యక్తం చేశారు.

### పీఏసీఎస్ ఉత్తమ కార్యదర్శిగా పుట్టి నరసింహులు.... కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న పుట్టి నర్సింలు

**రామాయంపేట, జనవరి 26, ప్రభాతవార్త :** గతతంత్ర దినోత్సవ సందర్భంగా రామాయంపేట సహకార సంఘంలో సెక్రటరిగా విధులు నిర్వహిస్తున్న పుట్టి నర్సింలు ఉత్తమ సెక్రటరీగా ఎంపికయ్యారు. సంబంధిత డీసీవో కరుణ, ఆఫీస్ సూపరిండెంట్ అంబర్‌సింగ్ రాథోడ్‌లు పుట్టి నర్సింలు పేరును ఎంపిక చేయడం జరిగింది. మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకోవడం జరిగింది. పుట్టి నర్సింలుకు ప్రశంసాపత్రం రావడం పట్ల స్థానిక పీఏసిఎస్ చైర్మెన్ బాదె చంద్రం, పాలకవర్గంసభ్యులు, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.జి.శ్రీనివాస్‌శర్మ, రామాయంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బసన్నపల్లి మల్లేశంతో పాటు పలువురు అభినందనలు తెలియజేశారు.

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీల సీజ్

**సిద్దిపేట అర్బన్, జనవరి 26, ప్రభాతవార్త:**

ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 5 లారీలను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. సిద్దిపేట టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నర్సాపూర్ చౌరస్తా కుంకుమ మిల్లు వద్ద మూడు వాహనాలు, చిన్నకోడూరు పోలీసు స్టేషన్ పరిధిలో రెండు లారీలలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సీఐలు రమేష్. నరేష్, సిబ్బంది దాడి చేసి 5 వాహనాలను సీజ్ చేసి పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీ డా॥అనురాధ అదేశాల మేరకు దాడులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమంగా రవాణా చేసిన, నిల్వ ఉంచిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. జూదం, గ్యాంబ్లింగ్, చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై నిఘా పెట్టడం జరుగుతుందన్నారు. గ్రామాలలో, పట్టణాలలో ఇసుక అక్రమ రవాణ చేసిన, పిడిఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన రవాణా గ్యాంబ్లింగ్, పేకాట మరి ఏదైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే 8712667100, 8712667447, 8712667446 లేదా 100కు సమాచారం అందించాలన్నారు.



అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీల్‌ను సీజ్ చేసిన దృశ్యం

### ప్రశంసా పత్రాల అందజేత



జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న వార్డెన్ సత్యనారాయణ

**చిన్నశంకరంపేట, జనవరి 26, ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలో నిర్వహించిన గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా పాలనాధికారి రాజర్షి షా చేతుల మిదుగా చిన్నశంకరంపేట ఎస్టీ వసతి గృహం వార్డెన్ సత్యనారాయణ, పిహెచ్‌సి పర్యవేక్షకుడు యాదగిరిలకు ప్రశంసా పత్రాలను అందించారు. విధి నిర్వహణలో భాగంగా మాకు ఈ గౌరవం దక్కిందని మరింత ఉత్సాహంగా విధులు నిర్వహిస్తామని వారు తెలిపారు.



జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న పిహెచ్‌సీ సిబ్బంది యాదగిరి

## జిల్లా అభివృద్ధికి అందరూ పునరంకితం కావాలి

### జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 26, ప్రభాతవార్త:**

జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 75వ గణతంత్ర దినోత్సవవేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలో ఆయాశాఖల్లో ఉత్తమ ప్రతిభ చాటిన అధికారులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందచేశారు. విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక ప్రదర్శనలు సభికులకు ఆకట్టుకున్నాయి. ఆయా శాఖల ద్వార కొనసాగుతున్న కార్యక్రమాలకు సంబంధించి శంకటాలను ప్రదర్శించారు. అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలపై ఆయాశాఖలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి నిత్యం 51 వేల మంది మహిళలు ఆర్టీసిలో ఉచిత ప్రయాణాలు చేస్తున్నారని,పథకం ప్రారంభం నుంచి నేటివరకు 24 లక్షల మంది మహిళలు పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారని, పథకం మహిళల సాధికారతకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు 5 లక్షల నుంచి 10 లక్షల వరకు వినియోగించుకోవచ్చన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 3,91,565 మంది ధరఖాస్తులు చేసుకున్నారని, ధరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. క్షేత్ర పరిధిలో పరిశీలించి



పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

అర్హులను ఆయా పథకాలు అమలు చేసేలా కృషి చేస్తామన్నారు. ఇటీవల ముగిసిన శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయని, అందుకు సహకరించిన జిల్లా యంత్రాంగానికి, పోలీసు అధికారులకు, సిబ్బందికి, ప్రజనలు చైతన్య పర్చడంలో సహకరిస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

**అంకిత భావంతో అధికారులు విధులు నిర్వహించాలి**

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 26, ప్రభాతవార్త:**

అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని జల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు. శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డిలోని సమీకృత కలెక్టరేట్ సముదాయంలో కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనాన్ని కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరేలా నిబద్దతతో కృషి చేయాల్సిన అవసరం ప్రతి అధికారిపై ఉందన్నారు. సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి తథ్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, జిల్లా అధికారులు, ఉద్యోగులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

## ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

**-నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

**శివ్వంపేట, జనవరి 26 ప్రభాతవార్త:** ఎన్నికలకు ముందు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి విమర్శించారు. శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామంలో రూ. 50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచి ఆర్.సాన్వీరమాకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులతో పాటు ప్రజలను సిఎం రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని ఆరోపించారు. త్వరలో హామీలను అమలు చేయని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తేనే ఈ ప్రాంతమంతా అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, ఎంపీపీ ఉపాధ్యక్షులు రమాకాంత్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వై. రమణాగౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, యాదాగౌడ్, చింత స్వామి, మహిపాల్‌రెడ్డి, ఆకుల శ్రీనివాస్, పవన్‌గుప్త, సార శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేత...**

**శివ్వంపేట, జనవరి 26 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా అక్కడి సర్పంచి సాన్వీ రమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలు నిర్వహించడం జరిగింది. గ్రామంలోని యువకులకు వాలీబాల్, క్రికెట్, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే సునితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిల చేతుల మీదుగా సర్పంచి సాన్వీ రమాకాంత్‌రెడ్డి తాను స్వచ్ఛందంగా నిర్వహించి బహుమతులతో పాటు నగదును కూడా బహుకరించారు. తన పదవీ కాలంలో కొత్తపేట గ్రామాన్ని అభివృద్ధి పరచటమే కాకుండా గ్రామస్థుల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేసిన సర్పంచిని సునితారెడ్డి, మదన్‌రెడ్డిలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, ఎంపీపీ ఉపాధ్యక్షులు రమాకాంత్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వై. రమణాగౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, యాదాగౌడ్, చింత స్వామి, మహిపాల్‌రెడ్డి, ఆకుల శ్రీనివాస్, పవన్‌గుప్త, సార శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు ఎరువుల కొరత లేకుండా చూసుకోవాలి

**కొల్చారం, జనవరి26 ప్రభాతవార్త:** రైతులకు ఎరువుల కొరత లేకుండా చూసుకోవాలని కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి అన్నారు. శుక్రవారం కొల్చారం మండలం రంగంపేటలోని ఎరువుల దుకాణాలను సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. కొల్చారం మండలం రంగంపేట గ్రామంలోని ఎరువుల దుకాణాలను కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి మండల వ్యవసాయ అధికారి శ్వేతతో కలిసి సందర్శించారు. గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంతో పాటు మణికంఠ, శ్రీరామ ఫర్టిలైజర్‌లను సందర్శించి రికార్డులను, స్టాక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని, ఎరువుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో నవీన్, సిబ్బంది బీరప్ప, శ్రీను, దుర్గరాములు తదితరులు ఉన్నారు.

### బీజేపీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

**మెదక్ అర్బన్, జనవరి26 ప్రభాతవార్త:** గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మెదక్ పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్, మెదక్ పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, జిల్లా కార్యదర్శి నల్లాల విజయ్, ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు. 24వ వార్డులో కౌన్సిలర్ మేఘమాల రామ్‌చరణ్ యాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున బీజేపీ కార్యకర్తఉలు, కాలనీవాసులు పాల్గొని మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు.

**పాపన్నపేటలో...**

**పాపన్నపేట, జనవరి 26, ప్రభాతవార్త:** మండలంలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాపన్నపేట గ్రామ పంచాయితీ వద్ద చెర్వుపల్లి విశ్వనాథ్‌శర్మ, సర్పంచ్ తిమ్మయ్యగారి గురుమూర్తిగౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. బిజెపి కార్యాలయం వద్ద నాయకులు బీకొండ రాములు నేత, నీలగౌని యువజన సంఘం కార్యాలయం వద్ద అధ్యక్షులు బాచారం సతీష్, శివాజీ విగ్రహం వద్ద ఉన్న యూత్ కార్యాలయంలో సర్పంచ్ గురుమూర్తిగౌడ్, చేనేత సహకార సంఘం వద్ద ఇంచార్జి చైర్మన్ పడిగే కృష్ణ, పోస్టాఫీసు వద్ద బీపిఎం వినోద్,యూత్ కార్యాలయం వద్ద అధ్యక్షులు శ్రీకాంత్, పట్టణ బిఆర్ఎస్ కార్యాలయం వద్ద పట్టణ అధ్యఓఉలు నీరుడి ఇమ్మనియల్, మెడికల్ అసోసియేషన్ వద్ద అధ్యక్షులు గజవాడ రాజేశ్వర్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద డిసిసి అధ్యక్షులు శెట్టి శ్రీకాంతప్ప, కేంద్ర ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మీడియం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల వద్ద ప్రధానోపాధ్యాయులు సంగీత, అజీజ్ ఫాతిమా, మహేశ్వర్, పశువైద్య శాల వద్ద డాక్టర్ నాగార్జున పాటిల్, శ్రీ విద్యా పాఠశాల వద్ద ప్రిన్సిపాల్ రవీందర్‌గుప్తా, మంజీరా ఆటో యూనియన్ వద్ద అధ్యక్షులు ఎండి బాబర్, పిహెచ్‌సి వద్ద డాక్టర్ హరిప్రసాద్, ఎస్సీ హాస్టల్ వద్ద వార్డెన్ సత్యనారాయణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ నర్సింలు, ముదిరాజ్ సంఘం వద్ద మండల అధ్యక్షులు ముశెట్టి కిష్టయ్య, మండల టిఆర్‌వెస్ కార్యాలయం వద్ద మండల అధ్యక్షులు కత్త వెంకటేశం గుప్తా, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల వద్ద స్పషల్ ఆఫీసర్ మమత, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ వద్ద మనేజర్ కిషన్, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏఓ కిషోర్, వెలుగు కార్యాలయం వద్ద ఏపిఎం సాయిలు, రెవిన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, ఎంఆర్‌పి వద్ద ఎంపిడిఓ లక్ష్మీకాంత్‌రెడ్డి, సొసైటీ కార్యాలయం వద్ద చైర్మన్ గునిశెట్టి మల్లేశం గుప్తా, మండల పరిషత్‌లో ఎంపిపి అధ్యక్షురాలు చందనరెడ్డి, ఏడుపాయల దేవాలయం వద్ద చైర్మన్ బాలగౌడ్, పోలీసు ఠాణాలో ఎస్ఐ దాసరి మహిపాల్‌రెడ్డిలు జాతీయ జండాలను ఆవిష్కరించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ చాటన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా పార్టీల నాయ కులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఆయుధ కర్మాగారంలో...**

**కంది, జనవరి 26, ప్రభాతవార్త:** మండలంలోని ఆయుధ కర్మాగారం లో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని అధికారులు ఘనంగా జరుపుకున్నారు. ఆయా పాఠశాలల విద్యార్థుల మార్చ్ ఫాస్ట్, సంస్కృతిక కార్యక్రమాలు, యోగ కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. ప్రతిభ చాటిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆయుధ కర్మాగారం మేనేజర్ సుధాకర్ ట్రోఫిని అందించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి జయంతి వాణి, ఎన్సీసి అధికారి సిహెచ్ విజయ భాస్కర్, ఉపాధ్యాయులు సిహెచ్ రజిత, వినోద రాణి, రవీందర్, కనకదుర్గ, పుష్కరాగం, ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

**చిన్నశంకరంపేట మండలంలో...**

**చిన్నశంకరంపేట, జనవరి 26,ప్రభాతవార్త:** మండలంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాలు, విద్యా సంస్థలలో జాతీయ పతాకావిష్కరణ చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ భాగ్యలక్ష్మీరెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మన్నన్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నారాయణ గౌడ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధికారి సాయి సింధూ, అలాగే ప్రభుత్వ, ప్రవేటు పాఠశాల, కళాశాలలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపళ్లు జెండాను ఆవిష్కరించారు. ఖాజాపూర్ తండాలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు లంబాడి వేషధారణతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గజగట్లపల్లిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోదుల వేషధారణ ధరించి అలరించారు.



పెద్దశంకరంపేటలో జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం



అమీన్‌పూర్‌లో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి..



ఖిల్లాపైజాతీయజెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే రోహిత్



రామాయంపేట మున్సిపాలిటీలో...



వెల్దుర్తిలో...



కొల్చారంలో ఎంపీడీవో గణేష్‌రెడ్డి...



కొల్చారంలో తహశీల్దార్ గఫార్ మియా...



మెదక్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే

# వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలు

**పెద్దశంకరంపేట, జనవరి26 ప్రభాతవార్త:** మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాడ వాడల మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ గ్రేసీబాయి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో రఫీక్ ఉన్నీసా, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ బాల రాజు, పట్టణ గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఈవో వెంకటరాములు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు ప్రధాన కూడళ్లలో, కుల సంఘాల ఆధ్వర్యంలో, యువ జన సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, సర్పంచి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, ఎంపీటీసీలు వీణ సుభాష్‌గౌడ్, బోన్ల దత్తు, ఉప సర్పంచి దశరథ్, ఆయా పార్టీల నాయకులు ఆర్ఎన్. సంతోష్‌కుమార్, సురేందర్‌రెడ్డి, గంగారెడ్డి, నారాయణ, లక్ష్మణ్, పండరి తదితరులు పాల్గొన్నారు.

**అమీన్‌పూర్‌లో...**

**అమీన్‌పూర్, జనవరి 26 ప్రభాతవార్త:** 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలువేసి ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిల్ వైస్ చైర్మన్, నరసింహాగౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాల్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్ కృష్ణ, కల్పన ఉపేందర్‌రెడ్డి, కొల్లూరి చంద్రకళ గోపాల్, ప్రమోద్‌రెడ్డి, రాజేశ్వరి, కోఆప్షన్ షభ్యులు యూనుస్, యువ నాయ కులు తుమ్మల రశ్వంత్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాలప్ప, దాస్ యాదవ్, నందారం రమేష్‌గౌడ్, కొల్లూరి యాదగిరి, మాకం మల్లేష్, నల్ల మాధవరెడ్డి, నల్ల గోవర్ధన్‌రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

**బీరంగూడలో...**

**అమీన్‌పూర్, జనవరి 26 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా బీరంగూడలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఉప సర్పంచి చంద్రశేఖర్ పాల్గొని అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

**జాతీయ జెండాను ఆవిష్కరించిన కాట సుధ**

**అమీన్‌పూర్, జనవరి 26 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా బీరంగూడ కట్ట కమాన్ దగ్గర గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి జాతీయ జెండాను సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, అమీన్‌పూర్ 15వ వార్డు కౌన్సిలర్ కాట సుధ శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అమీన్‌పూర్ మున్సిపాలిటీ అధ్యక్షులు శశిధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**పటేల్‌గూడ్ గ్రామంలో...**

పటేల్‌గూడ గ్రామంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ ఈర్ల దేవానంద్, సర్పంచి నీతిష శ్రీకాంత్‌లు పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**ఖిల్లాపై జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే**

**మెదక్ అర్బన్, జనవరి 26 ప్రభాతవార్త:** 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెదక్ నియోజకవర్గ శాసన సభ్యులు డా. మైనంపల్లి రోహిత్ జాతీయ జెండా ను ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్, మాహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్మన్ కొండన్ సురేందర్‌గౌడ్, న్యాయవాది జీవన్‌రావు, బొజ్జ పవన్, ఉప్పల రాజేష్, కౌన్సిలర్ దొంతి లక్ష్మీముత్యంగౌడ్, అవారి శేఖర్,కాంగ్రెస్ పార్టీ పట్టణఅధ్యక్షులు గూడూరి ఆంజనేయులు, గూడూరి అవరింద్, మాజీ కౌన్సిలర్లు మున్నా, ఎస్‌డీ. జ్యోతి కృష్ణ, బట్టి సులోచన, హరిత, లల్లూ, డీజే రితీష్, మైనస్, సంగమేశ్వర్, పరశురాం, పోచేందర్, భూతపి, జీలకరి రాజలింగం, ఇస్మాయిల్, మంగ మోహన్‌గౌడ్, చంద్రబోస్, సూఫి, జాయ్‌ముర్రె, సయ్యద్ మున్నా, మంగరాజు, గాడి రమేష్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**రాచవీడు ఖిల్లాపై మువ్వెన్నెల జెండా...**

మెదక్ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ కోరికైన మెదక్ రాచవీడు ఖిల్లాపై ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెదక్ ప్రాంత వాసులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఫోటో3: ఏదుల్లాపూర్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచి కీర్తన హనుమంతరావు

**శివ్వంపేట మండలంలో...**

**శివ్వంపేట, జనవరి 26 ప్రభాతవార్త:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం శివ్వంపేట మండలంలోని వివిధగ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ప్రైవేట్ సంస్థల ఎదుట జాతీయజెండాను ఆవిష్కరించడం జరిగింది. తహశీల్దార్ కార్యాలయం ఎదుట తహశీల్దార్ శ్రీనివాస్‌చారి, మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీడీవో భవాని, పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ రవికాంత్‌రావు, గ్రంథాలయం ఎదుట గ్రంథాలయ అధికారి అర్చన, జూనియర్ కళాశాల ఎదుట ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట డాక్టర్ సాయిస్వామ్య, పంచాయతీ కార్యాలయం ఎదుట సర్పంచి శ్రీనివాస్‌గౌడ్, ఉన్నతపాఠశాల ఎదుట హెచ్ఎం బాలచంద్రం, ఐకెపీ కార్యాలయం ఎదుట ఏపీఎం వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ఈవో లావణ్య, పశు వైద్యశాల ముందు డాక్టర్ సంధ్యారాణి, ఎస్సీ హాస్టల్ ఎదుట వార్డెన్ దర్శన్, కస్తూరిబా బాలికల పాఠశాల ఎదుట ప్రత్యేక అధికారిణి మంజులలు జాతీయ జెండాను ఎగురవేశారు. అదేవిధంగా ఏదుల్లాపూర్ గ్రామ పంచాయితీ కార్యాలయం ముందు సర్పంచి కల్లూరి కీర్తన హనుమంతరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది.

**రామాయంపేటలో...**

**రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 26, ప్రభాతవార్త**

రామాయంపేట మున్సిపాలిటీలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రజిని, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, గాంధీ విగ్రహం వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి యాదగిరి, మండలప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి బిక్షపతి, ఐకెపికార్యాలయంలో ఏపిఎం రాములు, సర్కిల్ కార్యాలయంలో సీఐ లక్ష్మీబాబు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రంజిత్, ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ జయసుధ, పీఏసిఎస్ కార్యాలంలో చైర్మెన్ బాదె చంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, వివేకానంద విగ్రహం ముందు వివేకానంద యూత్ క్లబ్ అధ్యక్షుడు దోమకొండ చిన్న శ్రీనివాస్, ఆయా వార్డు కార్యాలయాల ముందు బొర్ర అనిల్‌కుమార్,సుందర్‌సింగ్, పుట్టి విజయ లక్ష్మియాదగిరి, గజవాడ నాగరాజు, చంద్రపు శోభకొండల్ రెడ్డి, దేమె యాదగిరి, మల్యాల కవితా కిషన్, దేవుని జయ రాజు, చింతల రాధాభవాని యాదగిరి, చిలుక గంగాధర్, సరాఫ్ సౌభాగ్య శ్యామ్, ఆయా పార్టీల కార్యాలయాల ముందు ఆయా పార్టీల అధ్యక్షులు, సగర సంఘం చిత్తారమ్మ దేవాలయం ముందు సంఘం అధ్యక్షుడు మర్కు భూమయ్య, వంజరి సంఘం ముందు అధ్యక్షుడు కాలేరు హరికిషన్, పద్మశాలి సంఘం ముందు అధ్యక్షుడు మద్దెల రమేష్, స్వర్ణకార సంఘం ముందు అధ్యక్షుడు ఎల్డి లక్ష్మీనారాయణతోపాటు ఆయా కుల సంఘాల ముందు అధ్యక్షులు, మంజీరా విద్యాలయం ముందు కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, వివేకానంద విద్యాలయం ముందు కరస్పాండెంట్ రామ్‌కుమార్‌తో పాటు పలువురు పతాకావిష్కరణ గావించారు. కాగా ఆయా పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురుని ఆకట్టుకున్నాయి.

**జాతీయ జెండాను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే...**

**మెదక్ అర్బన్, జనవరి 26 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షురాలు,మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ, బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ జెండాను కూడా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు లావణ్యరెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షులు సోములు, వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఎం.గంగాధర్, మండల పార్టీ అధ్యక్షులు అంజాగౌడ్, సీహెచ్‌చ శ్రీనివాస్‌రెడ్డి,పట్లోరి రాజు, మున్సిపల్ కౌన్లిసర్లు కృష్ణారెడ్డి, సమీయొద్దీన్, జయరాజ్, ఆర్‌కె. శ్రీనివాస్, బట్టి లలిత, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఉమర్, రత్న కిరణ్ బాని, నాయకులు జయరాంరెడ్డి, మోచి కిషన్, శివరామకృష్ణ, పురం వెంకటనారాయణ, బాని, నర్సింలు, కాశీనాథ్‌రావు, మమ్ముద్, ఫటేష్, ముకుందం, అశోక్, మోహన్, రాములు, సాప సాయిలు, శ్రీనివాస్, జగదీశ్వర్, నవీన్, కసాపురం కిరణ్, చాంద్‌పాషా, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**కొల్చారం మండలంలో...**

**కొల్చారం, జనవరి 26 ప్రభాతవార్త:** శుక్రవారం కొల్చారం మండల వ్యాప్తంగా 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల సంబరాలను అంబరాన్నంటాయి. ఈ వేడుకల్లో ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, కుల సంఘాలు, యువజన సంఘాలు పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట తహశీల్దార్ గఫార్ మియా, మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీడీవో గణేష్‌రెడ్డి, పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ మహమ్మద్‌గౌస్, గ్రంథాలయం ఎదుట ఉప సర్పంచి నింగోల్ల చెన్నయ్య, జూనియర్ కళాశాల ఎదుట ప్రిన్సిపాల్ యతి రాజవల్లి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట డాక్టర్ రమేష్‌నాయక్, గ్రామ పంచాయితీ కార్యాలయం ఎదుట సర్పంచి కరెంటు ఉమా రాజాగౌడ్, ఉన్నత పాఠశాల ఎదుట ప్రధానోపాధ్యాయులు, ఐకేపీ కార్యాలయం ఎదుట ఏపీఎం దైవ్య సుశిల్వ, వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ఏవో శ్వేతకుమారి, పశు వైద్యశాల ముందు డాక్టర్ ఫర్హీమ్ ఫాతిమా, బీసీ హాస్టల్ ఎదుట వార్డన్ భానుసింగ్, కస్తూరిబా బాలికల పాఠశాల ఎదుట ప్రత్యేక అధికారణి ధరణి, పీఏసీఎస్ కార్యాలయం ఎదుట చైర్మన్ నాగురి మనోహర్, సంఘమిత్ర యువజన సంఘం కార్యాలయం ఎదుట అధ్యక్షులు కావేశచారి, ఛత్రపతి శివాజీ యువజన సంఘం కార్యాలయం ఎదుట అధ్యక్షులు దొంకెన ప్రసాద్, ముదిరాజ్ సంఘం కార్యాలయం ముందు అధ్యక్షులు ఆశన్నగారి అంజం, విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఏఈ అహమ్మద్ అలీ, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలఎదుట ప్రిన్సిపాల్ జయలక్ష్మీ, మండల వనరుల కేంద్రం ఎదుట ఎంపీడీవో గణేష్‌రెడ్డి, జాతీయ జెండాను ఎగురవేశారు. అంగన్వాడీ కేంద్రాల ముందు అంగన్వాడీ టీచర్లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు వివిధ రకాల బహుమతులు స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ ముంజులకాశీనాథ్, వైస్‌ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ నాగవర్ధన్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్, ప్రజా పరిషత్ సూపరింటిండెంట్ విఠల్ నాయక్, ఏపీవో మైపాల్‌రెడ్డి, ఏపీఎం సుశిల్వ, ఏవో శ్వేతకుమారి, ఏఈవో వినిత భవాని తదితరులు పాల్గొన్నారు.

**మండలంలోని అన్ని గ్రామాల్లో...**

మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయితీ కార్యాలయాల ముందు స్థానిక సర్పంచులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ముందు, యువజన సంఘాలు, కుల సంఘాల ఆధ్వర్యంలో సైతం జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

**వెల్దుర్తిలో...**

**వెల్దుర్తి, జనవరి 26 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తితో పాటు అన్ని గ్రామాల్లో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట తహశీల్దార్ తులసీ రామ్, మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ మదుసూదన్‌గౌడ్, జూనియర్ కళాశాల ఎదుట ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట డాక్టర్ సౌజన్య, గ్రామపంచాయితీ కార్యాలయం ఎదుట సర్పంచి భాగ్యమ్మ ఆంజనేయులు, ఉన్నత పాఠశాల ఎదుట ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, మండల వనరుల కేంద్రం ఎదుట ఎంఈవో యాదగిరి, ఐకేపీ కార్యాలయం ఎదుట ఏపీఎం శంకర్, వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ఏవో ఝాన్సీ, పశు వైద్యశాల ముందు డాక్టర్ రేఖ, బీసీ హాస్టల్ ఎదుట వార్డన్ శ్రీనివాస్, పీఏసీఎస్ కార్యాలయం ఎదుట చైర్మన్ అనంతరెడ్డిలు జాతీయ జెండాలను ఎగురవేశారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ముందు, యువజన సంఘాలు, కుల సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.



ఎంపిడివో కార్యాలయం వద్ద తలకిందులుగా ఎగురుతున్న జాతీయపతాకం

## రామాయంపేటలో జాతీయపతాకానికి అవమానం...

**త్రివర్ణపతాకాన్ని తలకిందులుగా ఎగురవేసిన ఎంపిపి**

**రామాయంపేట/రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 26, ప్రభాతవార్త :** గణతంత్ర దినోత్సవ వేడుకలలో జాతీయ పతాకానికి అవమానం జరిగింది. శుక్రవారం రామాయంపేట మున్సిపాలిటీలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయ లో మండల పరిషత్ అధ్యక్షుడు నార్సింపేట బిక్షపతి చేతుల మీదుగా జరిగిన పతాకావిష్కరణలో జాతీయపతాకం తలకిందులుగా ఎగిరింది. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో ఎంపిపి బిక్షపతి జాతీయ పతాకం ఎగురవేసారు. అది కాస్తా కాషాయం రంగు కిందికి, ఆకుపచ్చ రంగు పైకి ఉండే విధంగా జెండా ఎగురడంతో కొందరు గమనించి చెప్పడంతో వెంటనే అటెండర్ జెండాను సరిచేసి మళ్లీ ఎగురవేసారు.కాగా మండల పరిషత్ కాంప్లెక్స్‌లో ఇలా జెండా తలకిందులుగా ఎగురడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. ఎంపీపీ కార్యాలయం సిబ్బంది జాతీయ జెండాను ఎగురవేసే ముందు సక్రమంగా ఉందాలేదా అని చూడకుండా అశ్రద్ధ, నిర్లక్ష్యం కారణంగానే ఈ సంఘటన జరిగిందని అంటున్నారు. జెండాను ఎగురవేసే ముందు ఎంపిడివో ఉమాదేవి జాతీయ జెండాను సక్రమంగా కట్టారా...లేదా అని మరీ సిబ్బందికి సూచించినా కూడా వారు ఎంత మాత్రం పట్టించుకోకుండా జెండాను ఎగురవేసారు. కాగా ఇక్కడ ఎంపిడివోగా విధులు నిర్వహిస్తున్న ఉమాదేవి ప్రస్తుతం రామాయంపేట మున్సిపాలిటీకి ఇంచార్జి కమీషనర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నారు. గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో బాగంగా ఆమె ఈరోజు ఉత్తమ మున్సిపల్ కమీషనర్‌గా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకునేందుకు జిల్లా కేంద్రమైన మెదక్‌లో ఉన్నారు.



గంజాయిని స్వాధీనంచేసుకొని నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

## గంజాయి స్వాధీనం..

**మెదక్ అర్బన్, జనవరి 26 ప్రభాతవార్త:** పట్టణంలోని రాంనగర్‌లో గురువారం డీటీఎఫ్ బృందం పీ అండ్ ఈఐ నరేందర్ దాడులు నిర్వహించారు. ఒక ఎండు గంజాయి కేసును గుర్తించారు. ఎండీ. పాషా ఇంటి వద్ద 150 గ్రాముల ఎండుగంజాయి, 3 గ్రాములు గంజాయి మొక్కలు, సొత్తు, కేసు పత్రాలు, అక్రమాస్తులు స్వాధీనం చేసుకొని నిందితుడిని మెదక్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించి న్యాయస్థానంముందు హాజరుపరచి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించి మెదక్ సబ్‌జైలులో ఉంచారు. గంజాయిని అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించివారు తెలియజేయాలని, వారిపేర్లను గోప్యంగా ఉంచబడ తాయని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎండీ. అబ్దుల్ రజాక్ తెలిపారు.

## బీరువాలోని నగదు చోరీ

**చిన్నశంకరంపేట, జనవరి 26,ప్రభాతవార్త:** బీరువాలో ఉంచిన నగదును గుర్తుతెలియని దుండగులు దొంగిలించిన సంఘటన మండల పరిధి జంగరాయిలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ నారాయణ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన జగపతి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. వ్యవసాయంపై వచ్చిన డబ్బులతోనే గ్రామంలోనే ఓ వ్యక్తి వద్ద చీటి కడుతూ డబ్బులను దాచుకుంటున్నాడు. గురువారం ఉదయం చీటి డబ్బులు రూ.60,500 రాగా తన ఇంటిలోని బీరువాలో దాచిపెట్టి పోలానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి బీరువాను తెరచి చూడగా అందులో దాచి ఉన్న నగదు కనిపించలేదు. గుర్తు తెలియని దుండగులు బీరువాను తెరచి డబ్బులను ఎత్తుకెళ్లినట్లు బాదితుడు వాపోయాడు. జగపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కౌడిపల్లిలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**కౌడిపల్లి, జనవరి 26, ప్రభాతవార్త:**

75వ గణతంత్ర దినోత్సవాని పురష్కరించుకోని మండల కేంద్రమైన కౌడిపల్లి తోపాటు ఆయా గ్రామాల్లో శుక్ర వారం నాడు మువ్వన్నెల జెండాను ఏగురేసి, వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కౌడిపల్లి పంచాయితీ కార్యాలయం ఎదుట కార్యదర్శి వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ కారా ్యలయం వద్ద మండల పార్టీ అధ్యక్షులు పట్లోరి శ్రీనివాస్ రావు, పోలీస్ స్లేషన్‌లో ఎస్సై శివ ప్రసాద్ రెడ్డి, సామాజిక ఆరోగ్యకేంద్రం వద్ద డాక్టర్ ప్రవీన్, ఎస్‌బిఐ బ్యాంక్ వద్ద మేనేజర్ లక్ష్మికాంత్ రెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రాధాక్రిష్ణ, పశు వైద్యశాల వద్ద డాక్టర్ రాజు, జూనియర్ కళశాల వద్ద ప్రిన్సిపాల్ రామారావు, ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ఎంపిడిఓ శ్రీనివాస్, వ్యవసాయ డివిజన్ కార్యాలయం వద్ద ఏడిఏ, పంచాయతీ రాజ్ డివిజన్ కార్యాలయం ఎదుట డిఈఈ అమరేశ్, ఐకెపి కార్యాలయం వద్ద ఎపిఎం సంగమేశ్వర్, తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఆంజనేయులు, ఆయా అంగన్‌వాడి కేంద్రాల వద్ద కార్యకర్తలు, గురుకుల పాఠశాల వద్ద ప్రిన్సిపాల్, సంక్షేమ వసతి గృహాల వద్ద వార్డెన్‌లు, మండల వ్యాప్తంగా పంచాయతీ కారా ్యలయంల వద్ద కార్యదర్శులు, జాతీయ జేండాను ఏగురవేసి ఉత్సవాలను అత్యాంత్య వైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు ఎంపిపి రాజునాయక్, జేడ్పీటీసి కవిత, డిప్యూటి తహశీల్దార్ తారబాయి, ఆర్ఐ శ్రీహరి, మండల కోఆప్షన్ మెంబర్ మహమ్మద్ హైమద్, టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సార రామాగౌడు, ఎంపిటీసిలు శివ కుమార్ యాదవ్, కాలేరు శివాంజనేయులు, ఎంపిఓ కలీముల్లా, ఎపిఒ పుణ్యదాస్, గుంజరి ప్రవీణ్‌కుమార్, సార కిషోర్ గౌడు, జగన్, విద్యార్థులు, యువజన సంఘాల నాయకులు, ఆయా శాఖ ప్రభుత్వ సిబ్బంది పాల్గోన్నారు.

**పటాన్‌చెరులో...**

**పటాన్‌చెరు, జనవరి 26,ప్రభాతవార్త:**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డి పెట్ గ్రామ పంచాయతీ పరిధిలోని నేతాజీ నగర్ కాలనీలో రిపబ్లిక్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నేతాజీనగర్ కాలనీ వ్యవస్థాపకుడు జెనగేష్ ఆధ్వర్యంలో సర్పంచి కృష్ణ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కోలన్ దుర్గయ్య, బాచుపల్లి రాములు, రవీందర్‌నాథ్ యాదవ్, రాజేష్, ప్రజాపతి, సత్యం, శివ,లాలుయాదవ్, బహదూర్, మోహన్, శంకర్ తదితరులు పాల్గోన్నారు.



విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ బుక్స్ అందిస్తున్న హరీష్‌రావు

## విద్యార్థులు డిజిటల్ కంటెంట్ బుక్స్ సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** సాంకేతిక పరిజ్ఞానంతో మేధస్సుకు పదును పెట్టెల డిజిటల్ కంటెంట్ బుక్స్ ఎంతగానో ఉపయోగపడుతాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ బుక్స్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు కెసిఆర్ డిజిటల్ కంటెంట్.. టిహెచ్ఆర్ గిఫ్ట్ అడ్వాన్స్ గిఫ్ట్‌గా అందిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులు మంచిగా చదివి ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. స్కూల్‌లో స్పెషల్ స్టడీ..ఇంట్లో డిజిటల్ స్టడీ ఉంటుందన్నారు. రాష్ట్ర ఏర్పడిన తర్వాత సిద్దిపేట అన్ని రంగాలల్లో అదర్శంగా నిలిచిందని అదే స్ఫూర్తితో విద్యారంగంలో అభివృద్ధిలో అదర్శంగా నిలిచిందన్నారు. నేటి యువతరం డిజిటల్..మొబైల్ వైపు విశృంఖలగా విస్తరిస్తోందన్నారు. నియోజకవర్గంలో 2516 మంది పదో తరగతి విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పదోతరగతి విద్యార్థుల భవిష్యత్‌కు గొప్ప పునాది అన్నారు. కష్టంతోకాకుండ ఇష్టంతో చదివి అమ్మనాన్న అశయాలను నెరవేర్చాలన్నారు. డిజిటల్ కంటెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**శాఖాహారుల మెగా ర్యాలీ ప్రారంభించిన హరీష్‌రావు...**

ప్రతి ఆలోచన వెనుక సైన్స్ ఉంటుందని..శాఖహారం వెనుక సైతం సైన్స్ ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొండా మల్లయ్య గార్డెన్‌లో శాఖాహారుల మెగా ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. ఒక శాతం మాత్రమే శాఖహారులు ఉన్నారని మిగితా అంత మాంసాహారులు ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజల్లో గొప్ప చైతన్యం తేస్తుందన్నారు. మంచి అరోగ్యం..మంచి మనసుకు శాఖహారం మంచిదన్నారు. కార్యక్రమంలో నిర్వహకులు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

**డాక్టర్ అరవింద్‌ను అభినందించిన హరీష్‌రావు**

అయోధ్య బాల రాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి విశిష్ట అతిథిగా పాల్గొని వచ్చిన సిద్దిపేటకు చెందిన ప్రముఖ దంత వైద్యులు అరవింద్ శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావును కలిశారు. అయోధ్యలో స్వీకరించిన సీతారాముల ప్రతిమ, ప్రసాదంను హరీష్‌రావుకు అందజేశారు. ఈ సందర్బంగా డాక్టర్ అరవింద్‌ను హరీష్‌రావు అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 మందికి మాత్రమే అయోధ్య ప్రాణ ప్రతిష్టకు వెళ్లే అవకాశం దక్కగా సిద్దిపేటకు చెందిన బిడ్డకు అవకాశం దక్కడం గర్వకారణంగా ఉందన్నారు. సామాజిక సేవ కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొంటున్నందుకు ఈ గుర్తింపు దక్కడం అభినందనీయమన్నారు.

## అంగన్‌వాడీలో పిల్లలకు పలకల పంపిణీ

**సిద్దిపేట అర్బన్, జనవరి 26, ప్రభాతవార్త:** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మిట్టపల్లి అంగన్‌వాడీ కేంద్రం-2లో శుక్రవారం గ్రామానికి చెందిన పయ్యావుల శ్యామ్ యాదవ్ పిల్లలకు పలకలు పంపిణీ చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పిల్లలకు పలకలను పంపిణీ చేశారు. భవిష్యత్‌లో విద్యార్థులకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పద్మ, నాయకులు కనకమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రొ॥ కోదండరామ్ ఎమ్మెల్సీ నియామకం పట్ల హర్షం

**మిరుదొడ్డి, జనవరి 26, ప్రభాతవార్త :** ప్రొ॥ కోదండరాంను ఎమ్మెల్సీగా నియమించిన సందర్బంగా టిజెఎస్ పార్టీ జిల్లా కో-కన్వీనర్ అందె ప్రవీణ్, జిల్లా యువజన అధ్యక్షులు కీసర స్వామి, రాజిరెడ్డి, కార్యకర్తల అధ్వర్యంలో శుక్రవారం మిరుదొడ్డి మండల కేంద్రంలోని బస్టాండు చౌరస్తా వద్ద టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా అందె ప్రవీణ్ మాట్లాడుతూ ప్రొ॥ కోదండరాంను ఎమ్మెల్సీగా నియమించిన సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గవర్నర్ కోటాలో కోదండరాంను ఎమ్మెల్సీగా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, ప్రశాంత్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## నర్మెటలో అత్యాధునిక టెక్నాలజీతో ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ

**మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు**


పాలమాకులలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న హరీష్‌రావు

**నంగునూర్, జనవరి 26, ప్రభాతవార్త :** అత్యాధునిక టెక్నాలజీతో నర్మెట గ్రామంలో ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని నిర్మించడం జరుగుతుందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నర్మెట గ్రామంలో నిర్మిస్తున్న అయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ టిఎస్ ఆయిల్ ఫెడ్ అధ్వర్యంలో నిర్మిస్తున్న ఫ్యాక్టరీ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. రైతులు ఆయిల్‌ఫామ్ తోటలను సాగు చేయడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, కోల రమేష్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, కిష్టారెడ్డి తదితరులు ఉన్నారు.

**ఆటలు పోటీతత్వాన్ని పెంపొందిస్తుంది...**

అటలు పోటీ తత్వాన్ని పెంపొందించడానికి అరోగ్యాన్ని మెరుగు పరచడానికి క్రీడలు ఎంతోగానో ఉపయోగపడుతాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో యూత్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. యువత క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు కుమార్, ఓజాల్, సకినాల శివశంకర్, దుంబాల శ్రీనివాస్, వేల్పుల ఐలయ్య, పరమేశ్వర్, పంగ రవి, రంగు రమేష్, దామోదర్, జానీ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ పాలమాకుల గ్రామ అధ్యక్షుడిగా రాజేందర్

**నంగునూర్, జనవరి 26, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పాలమాకుల కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులుగా దండేబోయిన రాజేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సుద్దాల మహేందర్, జీడికండి చంద్రం, ప్రధాన కార్యదర్శిగా వార్థోలు ఐలయ్య, సహాయ కార్యదర్శిగా బోగి శ్రీనివాస్, కోశాధికారిగా వర్ధన్ శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుండె రాజు, ఉపాధ్యక్షులుగా సందబోయిన రవి, ప్రధాన కార్యదర్శిగా ఏటి రవి, కోశాధికారిగా వర్ధన్ ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు. ఎస్సీ సెల్ అధ్యక్షులుగా ముంద్రాతి వేణు, బీసీ సెల్ అధ్యక్షులుగా వర్థోలు సాగర్, ఉపాధ్యక్షులుగా గుండెలు కొమురయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా ఎండి.హరీష్, ఉపాధ్యక్షులుగా సాజిద్, గ్రామ సోషల్ మీడియా సందబోయిన కృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు రంగు అశోక్‌గౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


గ్రామశాఖ అధ్యక్షున్ని శాలువాతో సత్కరిస్తున్న దృశ్యం

# జిల్లాలో ఘనంగా 75వ గణతంత్ర వేడుకలు


గౌరవ వందనం చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో...


కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...


కొమురవెల్లి దేవాలయ కార్యాలయం ముందు...


గజ్వేల్‌లో బిజెపి నేతలు...



మర్కుక్ పోలీస్‌స్టేషన్‌లో...


ములుగు తహసీల్దార్ కార్యాలయం వద్ద....



మిరుదొడ్డిలో...

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లాలో 75వ గణతంత్ర వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వీధి వీధినా త్రివర్ణ పతాకాలు రెపరెపలాడాయి. ప్రభుత్వ, ప్రైవేటు, కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, యుజవన, కార్మిక, కుల సంఘాలు, స్వ చ్ఛంధ సంస్థల ఎదుట జాతీయ జెండాలు ఆవిష్కరించారు.

**జిల్లా కలెక్టరేట్‌లో...**

జిల్లా కలెక్టరేట్‌లో 75వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ జాతీయ జెండాను అవిష్కరించి గౌరవ వందనం చేశారు. అనంతరం అమె పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విద్యార్థులకు ఇంగ్లీష్, డిక్షనరీ, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టరేట్ ఎవో రెహమాన్, డిఅర్‌ఓ నాగరాజమ్మ, కలెక్టరేట్ సిబ్బంది, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మ జాతీయ జెండాను అవిష్కరించారు. సీపీ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాసరావు జాతీయ జెండాను అవిష్కరించారు. ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ సురేందర్‌రెడ్డి, టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ రవికుమార్, రూరల్ సీఐ కార్యాలయంలో సీఐ చేరాలు జాతీయ జెండాలను అవిష్కరించారు.

అలాగే అర్టీఓ కార్యాలయంలో ఇంచార్జి డిటిఓ లక్ష్మణ్, సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో అధ్యక్షులు కలకుంట్ల రంగచారి జాతీయ జెండాను అవిష్కరించారు. కళా శాలలు, పాఠశాలల వద్ద ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యా యులు జెండాలను అవిష్కరించారు.

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో...**

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు జాతీయ జెండాను అవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ బిఅర్‌ఎస్ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజుల రాజనర్సు పట్టణంలోని లాల్‌కమాన్‌తో పాటు మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాలను అవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...**

జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కారా ్యలయంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షులు తూంకుట నర్సారెడ్డి జాతీయ జెండాను అవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దరిపల్లి చంద్రం, డాక్టర్ సూర్యచంద్రవర్మ, బొమ్మల యాదగిరి, ఎం.డి.ఇమామ్(అత్తు), గంప మహేందర్‌రావు, దాసరి రాజు, లక్ష్మీ పాల్గొన్నారు.

**బిజెపి కార్యాలయంలో...**

జిల్లా కేంద్రంలోని బిజెపికార్యాలయంలో 75వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్‌రెడ్డి జాతీయ జెండాను అవిష్కరించారు.కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

**బెజ్జంకి మండలంలో...**

**బెజ్జ ంకి/మిరుదొడ్డి,/కొమురవెల్లి/తొగుట, జనవరి 26, ప్రభాతవార్త :** బెజ్జంకి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గురువారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు కుల సంఘాల వద్ద జాతీయ జెండాలను అవిష్కరించారు. అలాగే మండలంలోని అయా గ్రామాల్లోని గ్రామ పంచాతీయల వద్ద జాతీయ జెండాలను అవిష్కరించారు.

**మిరుదొడ్డి మండలంలో...**

మండలంలోని ఆయా గ్రామాల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, మహనీయుల విగ్రహాల వద్ద మువ్వన్న జెండాలు రెపరెపలాడాయి. మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్,ఎంపిడిఓ కార్యాలయంలో, వ్యవసాయ కార్యాలయంలో ఎవో, అరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారి, పిఎసిఎస్ కార్యాయలయంలో చైర్మన్, ఎఎంసి కార్యాలయంలో చైర్మన్, గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ రాములు,జాతీయ జెండాలను అవిష్కరించారు. అయా కార్యక్రమాలలో ఎంపిపి గజ్జల సాయిలు, తహశీల్దార్ గోవర్ధన్, డాక్టర్ షమీం సుల్తానా, రాజలింగారెడ్డి, నరేష్, సర్పంచ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

**కొమురవెల్లి మండలంలో...**

మండలంలోని అయా గ్రామాల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ లక్ష్మీనారాయణ, మల్లికార్జునస్వామి దేవాలయం కార్యాలయం వద్ద ఈవో బాలాజీ, ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ అనురాధ, పోలీసుస్టేషన్ వద్ద ఎస్ఐ నాగరాజు, అర్యవైశ్య నిత్యాన్నసత్రంలో తడకమడ్ల దక్షిణామూర్తి జాతీయ జెండాలను అవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శంకర్ లింగం, మాజీ అధ్యక్షులు బుచ్చిలింగం, ఆర్యవైశ్య కుల సభ్యులు పాల్గొన్నారు. అలాగే కొమురవెల్లిలో సర్పంచ్ సార్ల లతాకిష్టయ్య, రసులాబాద్‌లో సర్పంచ్ స్వామిగౌడ్, రాంసాగర్‌లో సర్పంచ్ తాడూరి రవీందర్, ఐనాపూర్‌లో సర్పంచ్ రమణారెడ్డి, గౌరాయిపల్లిలో సర్పంచ్ సద్ది కృష్ణారెడ్డి, కిష్టంపేటలో సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, కొమురవెల్లి ఎంపిటిసి-1 లింగంపల్లి కవిత కనకరాజు, కొమురవెల్లి-2 ఎంపిటిసి కొయ్యడ రాజమణి శ్రీనివాస్, గురువన్నపేట ఎంపిటిసి సాయిమల్లులు జాతీయ జెండాలను అవిష్కరించారు.అయా కార్యక్రమాలలో గ్రామ ప్రజలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**తొగుట మండలంలో..**

తొగుట మండల పరిధిలో 75వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ఎంపిడిఓ, పోలీసు స్టేషన్‌లో సీఐ కమలాకర్, కాన్గల్ సొసైటీ వద్ద చైర్మన్ కన్నయ్యగారి కిషన్‌రెడ్డి, ఎఎంసి కార్యాలయం వద్ద చైర్మన్, తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్, ఎంఈఓ కార్యాలయం ఎదుట ఎంఈఓ జాతీయ జెండాలను అవిష్కరించారు.

**చిన్నకోడూరులో...**

మండల పరిధిలోని అయా గ్రామాల్లో 75వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీంతో ఊరురా.. మూడు రంగుల మువ్వనల జెండాలు రెపరెపలాడాయి. ఎంపిడిఓ కార్యాలయంవద్ద ఎంపిడిఓ శ్రీనివాస్, తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ విజయలక్ష్మీ, పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ సుభాష్‌గౌడ్, పంచాయతీ కార్యాయలం ఎదుట సర్పంచ్ కాముని ఉమేష్‌చంద్ర, మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రావు కమిటీ అధ్వర్యంలో అధ్యక్షులు జేరిపోతుల యాదగిరి జాతీయ జెండాలను అవిష్కరించారు.

**ములుగు మండలంలో...**

**ములుగు, జనవరి 26 (ప్రభాతవార్త):** మండలంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ములుగు తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించగా పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ విజయ్‌కుమార్, స్థానిక గ్రామపంచాయతీ వద్ద బట్టు మాధవి అంజిరెడ్డి, కో-ఆపరేటివ్ బ్యాంక్ వద్ద చైర్మన్ బట్టు అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్‌గుప్త, ఎంపిపి కార్యాలయం వద్ద ఎంపిడిఓ వెంకటేశ్వర్‌రెడ్డి, వంటిమామిడి మార్కెట్ వద్ద సెక్రటరీ రేవంత్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లావణ్య అంజన్‌గౌడ్, ఎంపిపి ఉపాధ్యక్షుడు వీరన్నగారి దేవేందర్‌రెడ్డి, జెడ్‌పి కో-ఆప్షన్ సభ్యుడు సలీం, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేష్ గౌడ్, ఎంపిటిసి లింగ హరిబాబు, నవ్యశ్రీ రాజేందర్‌రెడ్డి, కొన్యాల మమత బాల్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సంఘం యువతవిభాగం ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా పాల్గొన్నారు.

**మర్కుక్ మండలంలో...**

**మర్కుక్, జనవరి 26 (ప్రభాతవార్త):** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలవ్యాప్తంగా జెండా పండుగ ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ఎస్ఐ శంకర్, తహసీల్దార్ కార్యాలయం ముందు తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు, మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఓ ప్రవీణ్, మండలంలోని పలు గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యాలయాలు, యువజన సంఘాలు, కుల సంఘాలు, పలు పార్టీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేసి గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బిజెపి ఆధ్వర్యంలో...**

**గజ్వేల్ టౌన్, జనవరి 26 (ప్రభాతవార్త):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఉప్పల మధుసూదన్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో


జగదేవ్‌పూర్ ఎంపిడిఓ కార్యాలయం వద్ద...

బిజెపి మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్, నాయకులు డాక్టర్ నరేష్ బాబు, జనార్ధన్, నాగు, నాయిని సందీప్, పంబాల శివ, మైస విజయ, నవీన్, ప్రశాంత్, అరవింద్, కుంకుమ రాణి, సుమతి, నీరజ, మమత, సరిత, అఖిల పాల్గొన్నారు.

**వర్గల్ మండలంలో...**

**వర్గల్, జనవరి 26 (ప్రభాతవార్త):** మండలంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ హరికిరణ్, గౌరారం పోలీస్‌స్టేషన్ వద్ద సిఐ జానకిరాంరెడ్డి, ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఎంపిడిఓ మేరీ స్వర్ణకుమారి, ప్రభుత్వాసుపత్రి వద్ద డాక్టర్ హరిత, గ్రామపంచాయతీ వద్ద సర్పంచ్ తూంకుంట గోపాల్‌రెడ్డిలు త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. అలాగే మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, కుల సంఘాలు, యువజన సంఘాల వద్ద జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

**జగదేవ్‌పూర్ మండలంలో...**

**జగదేవ్‌పూర్, జనవరి 26 (ప్రభాతవార్త):** మండలంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను మండల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ చంద్రమోహన్, ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ శ్రీనివాస్‌వర్మ, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, మేజర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ కొత్త లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, రైతువేదిక వద్ద వ్యవసాయాధికారి వసంతరావులు మువ్వన్నెల జెండాలను ఆవిష్కరించారు. చాట్లపల్లి గ్రామంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ రాచర్ల నరేష్ గ్రామపంచాయతీ ముందు జాతీయ జెండాను ఆవిష్కరించి తదనంతరం గ్రామపంచాయతీ పరిధిలో సేవలు అందించే వివిధ శాఖల సిబ్బందికి, వార్డు సభ్యులకు మెమొంటోలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చేసిన నృత్యాలు ప్రజలందరినీ ఆకర్షింపజేశాయి. కార్యక్రమంలో ఎంపిపి బాలేషంగౌడ్, జెడ్‌పిటిసి సుధాకర్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఎక్బాల్, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు మాసూరి కావ్య దర్గయ్య, యువకులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రచారంలో అబద్దాలు.. పాలనలో అసహనం

**-మాజీ మంత్రి హరీష్‌రావు**

**మర్కుక్, జనవరి 26 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో అబద్దాలు, ప్రభుత్వం ఏర్పడ్డాక పాలనలో అసహనం కనిపిస్తుందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. శుక్రవారం ఎర్రవల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయమంటే సహనం కోల్పోయి మాట్లాడుతున్నారని, వారికి ప్రజలే గుణపాఠం చెబుతారని, కాంగ్రెస్ నాయకులకు తొందరపాటు ఎక్కువైందని ఎద్దేవ చేశారు. ఎంతసేపు బిఆర్ఎస్ పార్టీపై బురదజల్లడం సరికాదని, రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో చెప్పిన పథకాలను అమలుచేసేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు అహంకారపూరిత వైఖరితో వ్యవహరించడం సరైనపద్దతి కాదని అన్నారు. తెలంగాణ తెచ్చిన కెసిఆర్ పట్ల మీ భాష పదజాలం సరిగా ఉండాలని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారని, హామీలు అమలు చేయకపోతే ప్రజలు ఎదురు ప్రశ్నిస్తారని అన్నారు. మాకిచ్చిన బాధ్యత మేము నిర్వర్తిస్తామని, మార్చి 17వ తేదీకి వంద రోజులు పూర్తవుతుందని, మహిళల విషయంలో ఒకే హామీ అమలుచేసి అన్ని అమలు చేశామంటే ఎలా అని గుర్తుచేశారు. ఒక మహిళకు మూడు హామీలతో పాటు నిరుద్యోగ భృతిపై అసెంబ్లీ సాక్షిగా అబద్దాలు చెబుతున్నారని, ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను ఎప్పటి నుండి అమలు చేస్తారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తెలపాలని సూచించారు.

## ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రారంభం

**దుబ్బాక, జనవరి 26, ప్రభాతవార్త:** దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. దక్షిణ కాశీగా పిలవబడే శ్రీ కూడావెల్లి రామలింగేశ్వర స్వామి మాఘమాసంలో జరిగే జాతర పనులను ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు.

## ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

**వెల్దుర్తి, జనవరి26 ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెల్దుర్తి గ్రామ పంచాయితీ పరిధిలోని ఎల్కపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం ఎల్కపల్లి గ్రామానికి చెందిన కానిక వెంకటేష్ (40) వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. వ్యవసాయానికి చేసిన అప్పులు ఎక్కువ కావడంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

**ములుగు, జనవరి 26 (ప్రభాతవార్త):** ఉరి వేసుకొని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆర్అండ్ఆర్ కాలనీ బహిలంపూర్ గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ములుగు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గువ్వ నరేష్(30) అనే వ్యక్తి గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లోని ఓ గదిలోకి వెళ్ళి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు తలుపులు బద్దలు కొట్టి చూడగా అప్పటికే నరేష్ మృతిచెందాడు. ములుగు పోలీసులకు సమాచారం అందివ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య లతతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

## పూరిగుడిసే దగ్ధం

**చిన్నశంకరంపేట, జనవరి 26,ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు పూరిగుడిసే దగ్ధం అయిన సంఘటన మండల పరిధి రుద్రారం శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు నివాస పూరిగుడిసే దగ్ధం అయింది. ప్రమాదంలో నిత్యావసర సరుకులు, బియ్యం, ఆధార్‌కార్డు కాలిపోయాయని, సుమారు రూ.50వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. కొంత కాలం క్రితం భార్య ఆనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిందని, ఇద్దరు కుమారులను సాకాలని, రెక్కాడితే కాని, డొక్కాడని పరిస్థితుల్లో ఉన్నానని, వ్యవసాయ భూమి కూడ లేదని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరారు.

### గ్రామీణ ప్రాంతాల్లో సద్గురు ఆశ్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయం

**ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి**

**నర్సాపూర్, జనవరి 26.ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో సద్గురు ఆశ్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిప్పల్‌తుర్తి గ్రామ శివారులో కబీర్ సేనఅధ్యక్షులు చత్రునాయక్, చిప్పల్‌తుర్తి ఎంపిటిసీ సంధ్యారాణి, చత్రునాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సద్గురు సేవా ఆశ్రమంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆద్యాత్మిక కార్యక్రమాలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి లు హాజరై ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సద్గురు శ్రీ కృష్ణానందాజీ మహారాజ్ ఆశీర్వాదాలు తీసుకున్నారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చెడు మార్గాలను వీడి దైవ మార్గంలో నడవాలని సూచించారు.ఇటువంటి సద్గురు ఆశ్రమాల ద్వార ప్రతి ఒక్కరు దైవ భక్తిని అలవర్చుకుంటారని అన్నారు ఈకార్యక్రమంలో నాయకులు మన్సూర్, బోగ చంద్ర శేఖర్, గోర్రె వెంకట్‌రెడ్డి, సంఘం కార్యదర్శి రేఖ వెంకటేశం గుప్త,సభ్యులు వగ్యనాయక్, చిప్పల్‌తుర్తి గ్రామ నాయకులు లక్ష్మణ్‌గౌడ్, జక్కపల్లి నాయకులు శ్రీనివాస్,జానకీ రామ్,బిక్కు బానోత్ తుకారాం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చోరీ చేయడానికి వచ్చి మహిళపై దాడి

**-చికిత్స పొందుతూ మహిళ మృతి**

**గజ్వేల్, జనవరి 26(ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెన్న శ్రీనివాస్ భార్య చెన్న శ్యామల శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి లేచి బయటకు రాగా ఇది గమనించిన ఓ గుర్తుతెలియని దొంగ వారి ఇంట్లో చొరబడ్డాడు. శ్యామల భర్త నిద్రిస్తున్న గదికి గొళ్ళెం పెట్టి బయటకు వచ్చి బాత్రూంలో నుండి బయటకు వచ్చిన శ్యామల ముఖంపై దిండు వత్తగా స్పృహ కోల్పోయింది. ఆమె మెడలో ఉన్న మూడు తులాల పుస్తెలతాడు, అర తులం చెవి కమ్మలు తీసుకొని పారిపోయాడు. కొద్దిసేపటి తర్వాత స్పృహలోకి వచ్చిన శ్యామల తన భర్త శ్రీనివాస్‌తో పాటు చుట్టుపక్కల వారికి విషయం తెలిపింది. కాగా శ్యామల పరిస్థితి బాగోలేకపోవడంతో గజ్వేల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం ఆమె పరిస్థితి విషమంగా ఉందని తెలుపడంతో మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌కు తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే శ్యామల మృతిచెంది నట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ, అడిషనల్ డిసిపి అడ్మిన్ అందె శ్రీనివాస్‌రావు, శాంతిభద్రతలు ఎస్.మల్లారెడ్డి, గజ్వేల్ ఏసిపి రమేష్‌లు కొల్గూరు గ్రామానికి చేరుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి వివరాలను సేకరించారు. కుటుంబసభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శ**

గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామంలో దొంగ బీభత్సం సృష్టించి శ్యామల ఇంట్లో బంగారాన్ని దొంగిలించే క్రమంలో ఆమెను గట్టిగా పట్టుకొని శ్వాస ఆడకుండా చేసి బంగారం ఎత్తుకెళ్ళడంతో స్పృహతప్పి మృతిచెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి సంఘటన జరగడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. శ్యామలను హత్య చేసిన దొంగను పోలీసులు త్వరగా పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట గజ్వేల్ ఏఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, కొల్గూరు ఎంపిటిసి జ్యోతి స్వామి తదితరులు ఉన్నారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**దుబ్బాక, జనవరి 26, ప్రభాతవార్త :** అప్పుల బాధతో మనస్థాపం చెంది ఉరేసుకునని అత్మహత్య చేసుకున్న సంఘటన భూంపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని మోతె గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. భూంపల్లి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన స్వామి(39) ఏడు సంవత్సరాల క్రితం ఇల్లు కట్టగా అప్పు కావడంతో మస్కట్ వెళ్లి వచ్చిన అప్పులు తీరకపోవడంతో సొంత ఇంటిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భువనేశ్వరరావు తెలిపారు.


ఇందిరాగాంధీ చౌక్ వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే


రామచంద్రాపురం గణతంత్ర దినోత్సవాల్లో ఎమ్మెల్యే


మునిపల్లిలో జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న సతీష్


సింగూరులో గౌరవవందనం స్వీకరిస్తున్న న్యాయమూర్తి


న్యాల్‌కల్‌లో తహసీల్దార్ కార్యాలయంలో...


మనూర్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల దృశ్యం


ఝరాసంగం మండల పరిషత్‌లో...


నాగల్‌గిద్దలో తహసీల్దార్...


హత్నూరలో...


అల్లాదుర్గం ఎంపిడివో కార్యాలయంవద్ద జండాను ఆవిష్కరిస్తున్న ఎంపిడిఓ


ఎల్‌ఐసి కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు


చౌటకూరులో జాతీయ జండాను ఆవిష్కరిస్తున్న సర్పంచ్

## జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, జనవరి 26 ప్రభాతవార్త:** పట్టణంలో 75వ గణతంత్ర్య దినోత్సవాన్ని పురుస్కరించుకుని ఇందిరాగాంధీ చౌక్‌వద్ద ఎమ్మెల్యే సంజీవ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే ఆయా మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలవద్ద జాతీయ జెండాను ఎగురవేసి ఘనంగా జరుపుకున్నారు. నారాయణఖేడ్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి జాతీయ జెండాను ఎగుర వేసి ఆట పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఆర్డీఓ కార్యాలయంవద్ద ఆర్డీఓ ఎన్.వెంకటేష్, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రిన్సిపాల్, కోర్టులో జడ్జీ, మున్సిపల్ కార్యాలయంవద్ద కమిషనర్, డీఎస్పీ కార్యాలయం వద్ద వెంకటరెడ్డి, ఎంపీడీఓ కార్యాలయం వద్ద, అంబేద్కర్ కార్యాలయంవద్ద నారాయణ, ఆయాశాఖల కార్యాలయల వద్ద అధికారులు, జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్‌శెట్కార్, చంద్రశేఖర్‌రెడ్డి, నగేష్‌శెట్కార్,పి.సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు ఆనంద్ స్వరూప్ శెట్కార్, దారం శంకర్‌సేట్, వివేకానంద, సద్దాం, నాయకులు, ఆయా శాఖల అదికారులు తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడలా రెపరెపలాడిన మువ్వన్నెల జెండా


అందోలు ఆర్డీవో కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఆర్డీవో పాండు

**జోగిపేట,జనవరి 26, ప్రభాతవార్త:** గణతంత్ర వేడుకలు జోగిపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోగిపేటలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వద్ద మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. జోగిపేట మున్సిఫ్‌కోర్టు వద్ద మెజిస్ట్రేట్ ధనలక్ష్మి, అందోలు–జోగిపేట ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో పాండు, మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ తిరుపతి, తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు అంటోని, ఎంపిపి కార్యాలయంలో ఇంఛార్జ్ ఎంపిడివో సౌజన్య, ఎక్సైజ్ కార్యాలయంలో సిఐ సుబ్రహ్మణ్య, జోగిపేట పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ అరుణ్ కుమార్‌గౌడ్, ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ రమేష్, మార్కెట్ కార్యాలయంలో కార్యదర్శి సునీల్, ట్రాన్స్‌కో డిఇ కార్యాలయంలో డిఇ శ్రీనివాస్, పిఆర్ ఇఇ కార్యాలయం వద్ద పిఆర్ ఇఇ అంజయ్య, బిఆర్ఎస్ కార్యాలయంవద్ద మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షులు బి.శివరాజ్, ముదిరాజ్ సంఘం వద్ద అధ్యక్షులు శివశేఖర్, వర్తకసంఘం వద్ద సెక్రెటరీ బిక్షపతిలు ఎగురవేయగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘణంగా నిర్వహించారు. ముఖ్యంగా పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు పలు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, వైస్ ఛైర్మెన్ ప్రవీన్‌కుమార్, ఎంపిపి బాలయ్య, డిసిఎంఎస్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, డిసిసిబి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పి.జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపిపి హెచ్.రామాగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, రంగ సురేష్‌గుప్త, చిట్టిబాబు, హరిక్రిష్ణగౌడ్, కోరబోయిన నాగరాజు, చందర్ నాయక్, దుర్గేష్, ఏఎంసి మాజీ ఛైర్మెన్లు మన్‌సాన్‌పల్లి మల్లిఖార్జున్‌గుప్త,

## జండాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే, న్యాయమూర్తి


క్యాంప్ కార్యాలయంలో జండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

**జహీరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల వద్ద ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లు జాతీయ జండాలను ఆవిష్కరించారు. ఆర్‌డిఓ కార్యాలయంపై ఆర్‌డిఓ వెంకారెడ్డి, పోలీసు ఠాణాలో డిఎస్‌పి వి రఘు, కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి సూరి కృష్ణ, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ డి సుభాష్‌రావు, మండల పరిషత్‌పై ఎంపిడిఓ పి సుమతి, రెవిన్యూ కార్యాలయంపై తహసీల్దార్ ఎస్ రవీందర్, డిగ్రీ కళాశాలలపై ప్రిన్సిపాల్ అస్లాం ఫారుఖి, ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ శ్రీధర్, రంజోల్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ లలితమ్మ, టీఎన్జీవో కార్యాలయంపై అధ్యక్షులు గడ్డం జనార్ధన్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై పట్టణ అధ్యక్షులు ఖండెం నర్సింలు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

## ఉత్తమ అవార్డు అందుకున్న ఏపిఓ రాజ్‌కుమార్


కలెక్టర్‌చే ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఏపిఓ రాజ్‌కుమార్

**ఝరాసంగం, జనవరి 26, ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకంలో ఏపిఓగా విధులు నిర్వహిస్తున్న రాజ్ కుమార్ ఉత్తమ ఏపిఓ అవార్డులను అందుకున్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురష్కరించుకుని నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిరాజ్‌కుమార్‌కు ఉత్తమ అవార్డును అందించి ప్రశంసా పత్రాన్ని బహుకరించారు. ఉత్తమ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని, ప్రజల, ఉపాధి కూలీలు, అధికారులు, సిబ్బంది సహకారంతోనే మెరుగైన సేవలు అందిస్తున్నానని రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

## పట్టణంలో భారీగా తిరంగ ర్యాలీ

**జహీరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో భారీ తిరంగ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జి డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని జాతీయ రహదారి పక్కలో గల లైఫ్ స్టైల్ కాంప్లెక్స్ నుంచి బాగారెడ్డి స్టేడియం వరకు భారీ తిరంగ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాఠశాల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజల్లో భారత రాజ్యాంగ స్ఫూర్తిని కలిగించేందుకు భారీ తిరంగ ర్యాలీ నిర్వహించినట్లు ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి అధ్యక్షులు చిరాగ్‌పల్లి నారాయణరెడ్డి, ఎంపిపి అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి, జడ్పీటిసి సభ్యులు నాగిశెట్టి రాథోడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖండెం నర్సింలు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పి నరసింహారెడ్డి, నాయకులు రాములుయాదవ్, జి భాస్కర్, ఎండి ఖాజామియా, ఎంఇ లుక్మాన్, శుక్లవర్ధన్‌రెడ్డి, రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఊరూరా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**రామచంద్రాపురం, జనవరి 26, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. డివిజన్ పరిధిలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వేడుకల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి జాతీయ జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ,అంబేద్కర్ చిత్రపటాలకు ఎమ్మెల్యే పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధూఆదర్శ్‌రెడ్డి, పుష్పనగేష్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమీషనర్ సురేశ్, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, మాజీ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

**మునిపల్లి మండలంలో...**

**మునిపల్లి, జనవరి 26 ప్రభాతవార్త :** మండలంలోని శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఉత్సాహభరితంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పోలీసుఠాణా, పంచాయతీ కార్యాలయాల వద్ద అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్‌లు జాతీయ పతాకాలను ఆవ్కిరించారు. పిల్లోడి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిల్లోడి సతీష్ జాతీయజెండాను ఆవిష్కరించి ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలల్లో నిర్వహించిన ఆటలపోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. శ్రీ రైజింగ్ కిడ్స్ పాఠశాల విద్యార్థిని వేదశ్రీ సైనిక వేషాధారణతో చూపురులను ఆకట్టుకుంది.

**పుల్కల్ మండలంలో...**

**పుల్కల్, జనవరి 26, ప్రభాతార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రజలు, అధికారులు, ప్రజాప్రతనిధులు, నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల వద్ద గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ భాస్కర్‌కుమార్, మండల పరషత్ ముందు ఎంపిడిఓ జయలక్ష్మి, గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ జ్యోతి, ఉన్నతపాఠశాల వద్ద ప్రధానోపాధ్యాయులు జాతీయ జండాలను ఆవిష్కరించారు.

**విజతలకు బహుమతులు...**

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ముదిమాణిక్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు విశిష్ట సేవరత్న అవార్డు గ్రీహిత ఇందూరి మోహన్ ఆర్థిక సహాయంతో బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రవి, విజయకుమార్, కిషన్, శ్రవణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**న్యాల్‌కల్ మండలంలో...**

**న్యాల్‌కల్, జనవరి 26, ప్రభాతవార్త:** 75వ గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం మండలంలోని ఆయాగ్రామాల్లో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో, న్యాల్‌కల్, హద్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, సొసైటీ కార్యాలయాలు, హద్నూర్ పోలీసుఠాణాలో, మిర్జాపూర్ (బి)లోని పిజి కళాశాలలో, పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో త్రివర్ణ పతాకాలను బాధ్యులు ఆవిష్కరించారు. విద్యార్థులు రంగు రంగు దుస్తులు ధరించి కోలాటాలు ఆడుతూ గ్రామంలోని పురవీధుల గుండా నిర్వహించిన శోభాయాత్రలు ఆకట్టుకున్నాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురష్కరించుకుని పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన ఆటల,పాటల పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు.

**మనూర్ మండలంలో...**

**మనూర్, జనవరి 26, ప్రభాతవార్త:** మండలంలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయా కార్యాలయాలు, విద్యాలయాల వద్ద త్రివర్ణ పతాకాలను బాధ్యులు ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ మల్లేష్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ శాజులోద్దీన్, పోలీసు ఠాణాలో ఎస్ఐ మూడ్ అంబ్రెయ్య, ఉన్నత పాఠశాలవద్ద ప్రధానోపాధ్యాయులు యాదగిరి వ్యవసాయ కార్యాలయం వద్ద ఎఓ శ్రీనివాస్‌రెడ్డి, ఐకెపి వద్ద ఏపిఎం వంశీకృష్ణ, రైతువేదికలవద్ద ఏఈఓ సంగమేశ్వర్, బాలుర వసతి గృహం వద్ద వార్డెన్ రాజిరెడ్డి, వెటర్నరీ ఆసుపత్రి వద్ద షకీల్‌లు జాతీయజండాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిపి అధ్యక్షులు కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి, సర్పంచ్ శివాజీరావు పాటిల్, మండల ఉపాధ్యక్షులు రాములు, ఎంపిటిసి సభ్యులు పెంటయ్య, సిద్ధారెడ్డి, మనన్, గాల్‌రెడ్డి, పంచాయితీరాజ్ ఏఈ ఆల్‌లింగం, ఏపిఓ షాయద్, ఉప తహసీల్దార్ మోగిని, ఆర్ఐ తాజుద్దీన్, ఆయా శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, పంచాయితీ కార్యాలయాల వద్ద గ్రామాల సర్పంచ్‌లు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

**చౌటకూరు మండలంలో...**

**చౌటకూరు జనవరి 26, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చౌటకూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వీరమణి మొగులయ్య, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఈశ్వర్ రాణి, ప్రభుత్వ ఆయుర్వేదం ఆసుపత్రిలో నరసయ్య, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, ముదిరాజ్ సంఘం కార్యాలయం వద్ద సంఘం అధ్యక్షులు గారెల నర్సింలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో సంఘాల నాయకులు, ప్రభుత్వ పాఠశాల వద్ద ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, కొర్పల్ పంచాయితీ కార్యాలయం వద్ద సర్పంచ్ నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ ముకుందంలు జాతీయ పథాకాలను ఆవిష్కరించి ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

**ఎల్ఐసి కార్యాలయలో...**

**జహీరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** పట్టణంలోని భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసి) కార్యాలయంలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను అధికారులు, డెవలప్‌మెంట్ అధికారులు, ఏజంట్లు, ఘనంగా జరుపుకున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని బ్యాంచి మేనేజర్ శ్రీనివాస రాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎల్ఐసి ఏజంట్లకు నిర్వహించిన కాంపిటేషన్ (ప్రజలకు పాలసీలుఅమ్మడంలో) ప్రతిభచాటిన ఏజంట్లకు డివిజన్ అధికారి మెడల్‌లు బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచి ఎబిఎం సుధాకర్, సిబ్బంది మాణయ్య, చంటి, శివ, ఎల్ఐసి ఏజంట్లు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన ఏజంట్లకు ఏబిఎం సుధాకర్ స్వీట్లు అందించి అందరి నోళ్లను తీపి చేశారు.

**అల్లాదుర్గం మండలంలో...**

**అల్లాదుర్గం, జనవరి 26, ప్రభాతవార్త:** మండలంలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ప్రైవేటు సంస్థలు, యువజన సంఘాలు, కుల సంఘాలు త్రివర్ణ పతాకాలను ఎగురవేసి దేశ భక్తిని చాటుకున్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఓ శంకర్, రెవెన్యూ కార్యాలయంవద్ద తహసీల్దార్ సతీష్‌కుమార్, సిఐ కార్యాలయం వద్ద సిఐ జార్జ్, ఐకెపి కార్యాలయం వద్ద ఏపియం నాగరాజు, పోలీసు ఠాణా వద్ద ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, రైతు సంఘం వద్ద అధ్యక్షులు బగిలీ రమేష్, పద్మశాలి సంఘం వద్ద అధ్యక్షులు వైసదానందం, ముదిరాజ్ సంఘం వద్ద అధ్యక్షులు మురారి రాములు, మండలంలోని గడిపెద్దాపూర్, ముస్లాపూర్, చిల్వర్, చేవెళ్ల, బహిరన్‌దిబ్బ, ముప్పారం, రెడ్డిపల్లి, వెంకట్రావ్‌పేట, కాయిదంపల్లి, కేజీబీవి, ప్రభుత్వ పాఠశాలల వద్ద ప్రధానోపాధ్యాయులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. విద్యార్థులు నిర్వహించిన శోభాయాత్ర ఆకట్టుకున్నాయి.

**హత్నూర మండలంలో...**

**హత్నూర, జనవరి 26, ప్రభాతవార్త:** మండలంలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సంధ్య, మండల పరిషత్ వద్ద ఎంపిపి అధ్యక్షులు నర్సింలు, పోలీసు ఠాణాలో ఎస్ఐ సుభాష్, గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ వీరస్వామిగౌడ్, గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ సుధాకర్, కళాశాలలో వివేకా నంద, ఎస్‌బిఐలో మేనేజర్ సంతోష్, ప్రభుత్వ పాఠశా లల వద్ద ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యాల యాల వద్ద సర్పంచ్‌లు, ఆయా సంఘాల వద్ద అధ్య క్షులు, రాజకీయ పార్టీ నాయకులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

**ఝరాసంగం మండలంలో...**

**ఝరాసంగం, జనవరి 26, ప్రభాతవార్త:** మండలంలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. ఝరాసంగంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సంజీవరావు, మండల పరిషత్‌లో ఎంపిడిఓ సుజాత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రమ్య, పశువైద్య శాలలో డాక్టర్ సునీల్ దత్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీల వద్ద సర్పంచ్‌లు, పాఠశాలల వద్ద ప్రధానోపాధ్యాయులు జాతీయ పతాకాలను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ యాసీన్, ఎంపిపి దేవదాస్, ఝరాసంగం సర్పంచ్ బొగ్గుల జగదీశ్వర్, ఎంపిటిసి మాలిపటేల్ రజిని ప్రియ సంతోష్ పాటిల్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు హనుమంతరావు పాటిల్, ఏపిఓ రాజ్‌కుమార్ స్వామి, ఆర్ఐ రామారావు, ఏపిఎం బాలకృష్ణ, ఆయా శాఖల అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

**నాగల్‌గిద్ద మండలంలో...**

**నాగల్‌గిద్ద, జనవరి 26, ప్రభాతవార్త:** మండలంలో గణతంత్ర దినోత్సవవేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌లు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ హబానాబీ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ రాజశేఖర్ కవ్‌లాస్, పోలీసు ఠాణాలో ఎస్ఐ సిద్దిరాములు, మోర్గి మోడల్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమేష్, కరస్‌గుత్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ స్వప్న, గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ సౌజన్యలు త్రివర్ణ పతాకాలను ఎగరేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా గ్రామాల్లో విద్యార్థులు రంగు రంగు దుస్తలు ధరించి నిర్వహించిన శోభాయాత్ర అందరినీ ఆకట్టుకున్నాయి.

## శిక్షణ పూర్తిచేసుకున్న యువతకు సర్టిఫికెట్లు

**కంది, జనవరి 26, ప్రభాతవార్త:** మండలంలోని ఇంద్రకరణ్‌లో పరిశోధన కేంద్రంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బి-ఫార్మసీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఫార్మ సిటికల్ క్వాలిటీ, క్వాలిటీ ఎస్యూరెన్స్‌లపై 4 నెలల శిక్షణ, ఐటిఐ డిప్లోమా పూర్తి చేసిన యువతకు 3 నెలలు శిక్షణను నిర్వహించారు. శిక్షణను పూర్తి చేసుకున్న విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో భాగంగా బి-ఫార్మా పూరినత చేసుకున్న 28 మంది యువతకు డాక్టర్ సునితరెడ్డి, జేఎన్టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ మంజర్ హుస్సేన్, రిజిస్ట్రార్‌ల చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందచేశారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సిఎస్ఆర్ హెడ్ సదానందరెడ్డి, అసోసియేటెడ్ అధ్యక్షులు హెచ్ఆర్ డాక్టర్ సురేష్‌కుమార్, జేఎన్టీయూ సిబ్బంది, అరబిందో ఫార్మ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విజ్ఞాన జ్యోతిలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

**ఝరాసంగం, జనవరి 26, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని విజ్ఞాన జ్యోతి పాఠశాలలో శుక్రవారం 75వ రిపబ్లిక్ డేను విద్యార్థులు ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులు రంగురంగు దుస్తులు ధరించి దేశా నాయకుల, భరత మాత వేషాధారణలతో నిర్వహించిన సంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు నాగన్న, శ్వేత, శావణ్, నాగజ్యోతి, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

## గంగ్వార్‌లో క్రికెట్ టోర్నమెంట్ షురూ

**న్యాల్‌కల్, జనవరి 26, ప్రభాతవార్త:** మండంలోని గంగ్వార్ గ్రామంలో శుక్రవారం ఉజ్వల్‌రెడ్డి ఫౌండేషన్ క్రికెట్ టొర్నమెంట్‌ను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. క్రీడా పోటీలను తిలకించేందుకు ఆయా గ్రామాల నుంచి క్రీడాకారులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ ఉజ్వల్‌రెడ్డి, టిపిసిసి రాష్ట్ర నాయకులు భాస్కర్ యాదవ్, మండల అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండంగారి తిరుపతిరెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, న్యాకల్ సొసైటీ చైర్మన్ సిద్దిలింగయ్యస్వామి, మాజీ ఎంపిపి అధ్యక్షులు విలాస్‌రెడ్డి, నాయకులు శుక్లవర్ధన్‌రెడ్డి, ముంగి శ్రీనివాస్‌రెడ్డి, కిరన్‌గౌడ్, బలరామ్‌రెడ్డి, వెంకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ నుంచి ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఆర్‌డిఓ వెంకారెడ్డి

## ఉత్తమ అవార్డు అందుకున్న ఆర్‌డిఓ, తహసీల్దార్

జహీరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త: జహీరాబాద్ డివిజన్ ఆర్‌డిఓ వెంకారెడ్డి, జహీరాబాద్ తహసీల్దార్ ఎస్ రవీందర్‌లు ఉత్తమ అవార్డును అందుకున్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆర్‌డిఓ వెంకారెడ్డి, జహీరాబాద్ తహసీల్దార్ ఎస్ రవీందర్‌లకు ఉత్తమ అవార్డు అందించి ప్రశంసాపత్రాని బహుకరించారు. ఇటీవల ముగిసిన జహీరాబాద్ శాసన సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా సేవలు అందించిన ఆర్‌డిఓ వెంకారెడ్డి సేవలకు గుర్తింపుగా అవార్డు దక్కింది. ఉత్తమ అవార్డులు అందుకున్న ఆర్‌డిఓ, తహసీల్దార్‌లకు రెవిన్యూ అధికారులు, సిబ్బంది, ఆయా పార్టీల నాయకలు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**మనూర్, జనవరి 26, ప్రభాతవార్త:**
ఈ నెల 27న మండల కేంద్రమైన మనూర్‌లో మండలంలోని ఆయా గ్రామాల లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మల్లేష్ కుమార్ తెలిపారు. చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్దిదారులకు చెక్కులను అందచేస్తారన్నారు. మనూర్‌లోని ఇందిరా క్రాంతి పథకం కార్యాలయ ఆవరణలో నిర్వహించే చెక్కుల పంపిణి కార్యక్రమం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అవుతుందని, అందుకు లబ్దిదారులు సకాలంలో కార్యక్రమానికి హాజరై చెక్కులు అందుకోవాలని తహసీల్దార్ మల్లేష్ కుమార్ సూచించారు.


విజిలెన్స్ ఎస్ఐ వెంకట్‌రాజుకు సేవా పతకం బహుకరిస్తున్న సీఎండి

## విజిలెన్స్ ఎస్ఐకి సేవా పతకం

**అల్లాదుర్గం, జనవరి 26, ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన విజిలెన్స్ ఎస్ఐ వెంకట్‌రాజుకు సేవా పథకాన్ని అందించారు. హైద్రాబాద్‌లో నిర్వహించిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సంగారెడ్డిలో విజిలెన్స్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకట్‌రాజుకు సిఎండి రేజ్వి ఉత్తమ సేవ పథకాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. సేవా పథకం అందుకున్న వెంకట్‌రాజు ఆనందం వ్యక్తం చేశారు. విధుల నిర్వాహణలో తనపై మరింత భారం పెరిగిందని, అంకిత బావంతో సేవలు అందచేస్తానన్నారు.

## ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**జహీరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:**
పట్టణంలోనిహీర ఫౌండేషన్ స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ప్రారంభించారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. ఎగ్జిబిషన్‌లో భాగంగా విద్యార్థులు మైమున తంకిన్, తహరిన్ డాక్టర్ బిర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి సంబంధించిన నమూనా కట్టడాన్ని ప్రదర్శించారు. ప్రదర్శనను తిలకించిన వ్యక్తులు విద్యార్థులు సచివాలయ నిర్మాణానికి ప్రభుత్వం వెచ్చించిన ఖర్చును, సచివాలయం విస్తీర్ణం, సచివాలయానికి సంబంధించిన పలు వివరాలను విద్యార్థులు ఓపికగా వివరింఆరు. 10 రోజుల పాటు కష్టపడి సచివాలయం నమూనాను తయారు చేసినట్లు విద్యార్థులు పేర్కొన్నారు.